AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
30-6-2026
NIZAMABAD / KAMAREDDY
PAGES - 2

పల్లె దవాఖానాకు జాగా కరువు..



2



2

దర్జాగా మొరం తవ్వకాలు

## డిచ్‌పల్లి మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు ప్రిన్సిపల్ దశరథ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జులై 6, 7 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దశరథ్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై స్పాట్ అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం



**అక్షరటుడే, ఇందూరు :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని మేయర్ ఉమారాణి అన్నారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించడం, పారదర్శక పరిపాలనను కొనసాగించడంపై శ్రద్ధ వహిస్తామన్నారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, వీధి దీపాలు, పౌర సేవలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశానికి శాసన మండలి సభ్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, కార్పొరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.



# ఎస్సారెస్పీకి వరద వచ్చేనా..



ఉత్తర తెలంగాణ వర ప్రదాయని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. వానాకాలం మొదలై నెల అవుతున్నా.. ప్రాజెక్ట్‌కు వరద రావడం లేదు. స్థానికంగా వర్షా లు లేకపోవడంతో జలాశయానికి ఇన్‌ఫ్లో లేక వెలవెలబోతుంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 15.149 టీఎంసీల నీరే ఉంది.

- అక్షరటుడే, ఆర్మూర్

▪ నెల రోజులుగా జాడ లేని వానలు ▪ రేపు తెరుచుకోనున్న బాబ్లీ గేట్లు ▪ ఎగువన కురిసే వర్షాలపై ఆశలు

శ్రీరామ్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1064.30 అడుగుల (15.149 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయంలో 15.672 టీఎంసీలు ఉండగా, ఈసారి 0.523 టీఎంసీలు తక్కువగా ఉంది. 24 గంటల సగటు ఇన్‌ఫ్లో 671 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, ఔట్‌ఫ్లో 817 క్యూసెక్కులుగా ఉంది.

### ఆయకట్టు రైతుల్లో ఆందోళన

జూన్ నెల ముగుస్తున్నా.. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టు పరిధిలోని 6 లక్షల ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగుకు నీరందుతుందా అనే భయం వెంటాడుతోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తే తప్ప ప్రాజెక్ట్‌కు భారీగా ఇన్‌ఫ్లో వచ్చే పరిస్థితి లేదు.

### మహారాష్ట్రపైనే ఆశలు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జూలై 1న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌లో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ 14 గేట్లను ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు తెరవనున్నారు. దీంతో ఎగువ నుంచి కొంత ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తేనే శ్రీరామ్‌సాగర్‌కు వరద వచ్చే అవకాశం ఉంది. బాబ్లీ గేట్లు అక్టోబర్ 28 వరకు 120 రోజులపాటు ఎత్తి ఉంచనున్నారు. మహారాష్ట్రలో బాబ్లీ ఎగువన ఉన్న ప్రాజెక్టులు అన్ని నిండిన తర్వాత ఎస్సారెస్పీకి వరద వస్తుందని అధికారులు తెలిపారు.

### ఆయకట్టు రైతులపై ప్రభావం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద మొత్తం 9.68 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీన్ని మూడు స్టేజీలుగా విభజించారు. వీటిలో స్టేజ్-1లో నిజామాబాద్, కామారెడ్డిలలో 1.90 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే స్టేజ్ 2లో నిజామాబాద్, నిర్మల్, జగిత్యాలలో 2.08 లక్షల ఎకరాలు ఉన్నాయి. స్టేజ్ 3లో జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, హన్మకొండ, సిద్దిపేట, సిరిసిల్ల, యాదాద్రి, నల్గొండ ఉండగా 5.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 15.149 టీఎంసీలు మాత్రమే ఉంది. ఇది డెడ్ స్టోరేజీ 5.18 టీఎంసీలకు కంటే కొద్దిగా ఎక్కువ. బాబ్లీ గేట్లు తెరిచినా ఎగువన వర్షాలు పడకపోతే ప్రయోజనం ఉండదు.

### అక్కడా వర్షా లు లేవు

ప్రస్తుతం మహారాష్ట్రలోని నాందేడ్, పర్భణి జిల్లాల్లో చెప్పుకోదగ్గ వర్షాలు పడలేదు. అక్కడ వర్షాలు కురిస్తేనే బాబ్లీకి ఇన్‌ఫ్లో వస్తుంది. గతేడాది జూలైఅక్టోబర్ మధ్య బాబ్లీ గేట్ల ద్వారా ఎస్సారెస్పీకి 32 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ రెండో వారం నుంచి రుతుపవనాలు చురుగ్గా మారితేనే ఇన్‌ఫ్లో మొదలయ్యే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం కింద కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని శ్రీరామ్‌సాగర్‌కు తరలించాలని రైతులు కోరుతున్నారు.



## ఎల్లారెడ్డి ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. మంగళవారం ఉదయాన్నే ఎల్లారెడ్డి ట్యాంక్‌బండ్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన మున్సిపల్ ఛైర్మన్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. ప్రస్తుతం జరుగుతున్న పనులు, రానున్న నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందేలా పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎక్కడా రాజీ పడకుండా పక్కాగా పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజా ధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.



## మూడు దశాబ్దాలకు పైగా సేవలు అభినందనీయం

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించడం అభినందనీయమని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నలుగురు ఉద్యోగులకు వీడ్కోలు పలికారు. ఎస్పీ రాజేష్ చంద్ర పదవి విరమణ పొందుతున్న అధికారులు, వారి కుటుంబ సభ్యులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబంతో ఆరోగ్యంగా జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

## మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, ఇందూరు:** మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని న్యాక్ సెంటర్‌లో మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేశారు. మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో, తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీని షబ్బీర్ అలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ కుటుంబాలకు అండగా నిలిచి, గౌరవప్రదమైన జీవనం సాగించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో రూ.1.02 కోట్ల వ్యయంతో మొత్తం 1,700 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించడం సంతోషకరమన్నారు. ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నుడా ఛైర్మన్ కేశ వేణు, నరాల రత్నాకర్, జావిద్ అక్రమ్, ఎంఏ పహీం, నయీం, కరీం, పాపా ఖాన్, హఫీస్ లయీక్ ఖాన్, హరూన్ ఖాన్, మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## నిషేధిత ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం ఛైర్మన్, కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని కిరాణా దుకాణాల్లో, చికెన్ సెంటర్లలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు గుర్తించారు. దీంతో సంబంధిత దుకాణాదారులకు పురపాలక చట్టాల ప్రకారం మొత్తం రూ.7,000 జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికరమైందని వ్యాపారులు, ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని అధికారులు సూచించారు. తనిఖీల్లో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. అంజయ్య, వార్డు ఆఫీసర్లు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన బోధన్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**అక్షరటుడే, బోధన్:** బోధన్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రక్రియ కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో కొనసాగింది. ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

### కోరం నిర్ధారించుకున్నాకే ఎన్నిక..

కో-ఆప్షన్ ఎన్నిక కోసం సరిపడా కోరంను నిర్ధారించుకున్న తర్వాత ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎక్స్ అఫిషియోను కలుపుకుని మొత్తం 39 మందికి గాను పూర్తి స్థాయిలో సభ్యులు హాజరయ్యారు. ఆయా కేటగిరీల వారీగా కో-ఆప్షన్ పదవి కోసం వచ్చిన ప్రతిపాదనల మేరకు పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించిన తదుపరి 12మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నామని ప్రకటించి సమావేశం హాల్ నుంచి బయటకు వెళ్లిపోయారు. మిగతా సభ్యులతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు.



### కో-ఆప్షన్ సభ్యులు వీరే..

మెజారిటీ సభ్యుల (19మంది) మద్దతు మేరకు దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి, మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ ప్రకటించారు. నూతనంగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందనలు తెలిపారు. అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్డీవో విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.

## భూ పోరాట సభకు తరలిరావాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉప్పల్ సమీపంలో జులై 2న నిర్వహించే భూ పోరాట సభకు టీఆర్ఎస్ ఉద్యమ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పార్టీ కామారెడ్డి నియోజకవర్గ నాయ కుడు రవీందర్ గుప్తా కోరారు. కామారెడ్డిలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మర్చిపోయిందన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్తాఫ్, ఏసు, మమత తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ జెండాకు ఎస్సై సెల్యూట్..! ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి..



**అక్షరటుడే, కామారెడ్డి:** గాంధారిలో మంగళవారం జరిగిన ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. కాంగ్రెస్ పార్టీ జెండాకు సెల్యూట్ చేశారనే ఆరోపణలు వివాదానికి దారి తీశాయి. కాంగ్రెస్ పార్టీ గాంధారి మండల కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గాంధారి ఎస్సై మహేందర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ జెండాకు సెల్యూట్ చేశారనే ఆరోపణలు రాజకీయ వర్గాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇందుకు సంబంధిత ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఎస్సై హోదాలో ఉంటూ విధి నిర్వహణను విస్మరించి ఒక రాజకీయ పార్టీ జెండాకు సెల్యూట్ చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో పోలీస్ వ్యవస్థ కాంగ్రెస్ పార్టీకి జేబు సంస్థగా మారిందని, పోలీసులు కాంగ్రెస్ తాబేదార్లుగా పని చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులను అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతపై ప్రజల్లో అనుమానాలు కలిగేలా ఇటువంటి చర్యలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీ వెంటనే విచారణ జరిపించి ఎస్సైపై తగిన చర్యలు తీసుకోవాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



## ‘లయన్స్’ సేవలను మరింత విస్తృతపర్చాలి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతపర్చాలని లయన్స్ ఇంటర్నేషనల్ నిజామాబాద్ రీజియన్ ఛైర్మన్ పుల్లం హన్మాండ్లు అన్నారు. నగరంలోని సందీప్ గార్డెన్స్‌లో మంగళవారం నిజామాబాద్ రీజియన్‌లోని లయన్స్ క్లబ్‌ల అధ్యక్షుడు, కార్యదర్శులు, కోశాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ ఛైర్మన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. క్లబ్‌లలో సభ్యత్వ నమోదును పెంచాలని.. పాత సభ్యులు క్లబ్‌ను వీడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా కార్యదర్శి డి.యాదగిరి, అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ, జిల్లా అదనపు కార్యదర్శులు ఉదయ సూర్య భగవాన్, శంకర్, జాయింట్ కోశాధికారి కరిపె రవీందర్, రీజియన్ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, జోన్ ఛైర్మన్లు ఎ.లింబాద్రి, విష్ణువర్దన్ తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణే సహకార సంఘం లక్ష్యం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు సంఘ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సంఘం పీఏసీ అధ్యక్షుడు ఏగుల నర్సింలు, క్లస్టర్ అధికారి లక్ష్మణ్ సంయుక్తంగా మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ అధ్యక్షుడు నర్సింలు మాట్లాడుతూ.. సహకార ఉద్యమం కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాదన్నారు. సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ కూడా సహకార స్ఫూర్తిలో ఒక భాగమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం క్లస్టర్ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ.. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, సహకార సంఘాల ద్వారా గ్రామీణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ సహకార వారోత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు విభిన్న సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి విశ్వనాథం, సంఘ సిబ్బంది మల్లేష్, సాయిబాబా, సత్యనారాయణ, ప్రభాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘పల్లె దవాఖానా’ పథకం భీమ్‌గల్ మండలంలో రెండడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. స్థల ఎంపిక విషయంలో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటోంది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా, అధికారుల నిర్లక్ష్య వైఖరితో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**



# పల్లె దవాఖానాకు జాగా కరువు..

■ నిధులున్నా నిర్మాణానికి నోచుకోని వైనం ■ శ్మశానవాటిక సమీపంలో స్థల కేటాయింపుపై నిరసన ■ ప్రజలకు అందుబాటులో ఉండేలా కేటాయించాలని డిమాండ్

మండల కేంద్రంలో 12 వార్డులు ఉన్నాయి. సుమారు 26 వేల జనాభా ఉంది. 5,600 గృహాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని బోదిరె గల్లీలోని ఒక ఇరుకైన అద్దె భవనంలో ప్రస్తుతం పల్లె దవాఖానా కొనసాగుతోంది. స్థలం సరిపోక, గాలి వెలుతురు లేక గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యులు పరీక్షలు చేయడానికి, రోగులు వేచి ఉండడానికి తగినంత చోటు లేక సతమతమవుతున్నారు. ఈ దుస్థితిని గమనించిన ప్రభుత్వం, గత ఏడాది ఏప్రిల్‌లోనే కొత్త భవన నిర్మాణానికి రూ.19.98 లక్షల నిధులను మంజూరు చేసింది.

### అసంతృప్తిలో స్థానికులు

నిధులు మంజూరైనా, నిర్మాణం కోసం అధికారులు ఎంపిక చేసిన స్థలంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చివర, శ్మశానవాటిక సమీపంలో భవనం నిర్మించాలని చూడడం విడ్డూరమని ప్రజలు మండిపడుతున్నారు. అక్కడికి వెళ్లాలంటేనే రోగులు జంకుతున్నారు. పైగా, వర్షాకాలంలో ఆ ప్రాంతం జలమయమై, రాకపోకలకు ఆటంకం కలిగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రజలకు అందుబాటులో కట్టాలి

పల్లె దవాఖానా నిర్మాణం అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తున్నాం. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించే దవాఖానాను ఎక్కడ పడితే అక్కడ కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే చోటనే నిర్మించాలి. దవాఖానా అంటే రోగులందరికీ అందుబాటులో ఉండాలి. శ్మశాన వాటిక పక్కన నిర్మించడం సమంజసం కాదు. వర్షాకాలంలో అక్కడ నీరు నిలిచి రోగులు రావడం కష్టంగా ఉంటుంది. కనీస సౌకర్యాలు ఉండవు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి, ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బోదిరె గల్లిలో లేదా భూమయ్య రైస్ మిల్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో దవాఖానా నిర్మించాలి.

**– నీలం రవి,**
**భీమ్‌గల్ మున్సిపల్ కౌన్సిలర్, సర్వసమాజ కమిటీ మాజీ అధ్యక్షుడు**

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవ వేతనాన్ని రూ.10 వేల వరకు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఉపయోగించే గుడ్లు, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మంద శంకర్, అనిల్, విజయలక్ష్మి, సుజాత, శకుంతలతో పాటు పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.





## తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గంధపు రాజు

**అక్షరటుడే, కోటగిరి :** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పోతంగల్ మండల కేంద్రానికి చెందిన గంధపు రాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, అఖిల భారత యాదవ కార్యదర్శి తోకల రామకృష్ణ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గంధపు రాజు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అన్నగౌడ్, నారాగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల చైతన్యం కోసం, అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు.



## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీ సీజ్

**అక్షరటుడే, బోధన్ :** మహారాష్ట్ర నుంచి సాలూర చెక్ పోస్ట్ మీదుగా తెలంగాణలోకి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. తహశీల్దార్ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర పాసింగ్ ఉన్న భారీ వాహనాన్ని బోధన్ శివారులో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం లారీని సీజ్ చేసి లారీ డ్రైవర్, తదితరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రతిరోజు రాత్రి సమయంలో మహారాష్ట్ర నుంచి తెలంగాణకు అక్రమ ఇసుక రవాణా సాగుతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా అవుతున్న నేపథ్యంలో వాటిని నిరోధించాల్సిన అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


## భరత్ చంద్ర పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని భరత్ చంద్ర పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆర్మూర్ శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాను కలిసి సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. భరత్ చంద్ర స్కూల్‌లో తల్లి తండ్రుల, విద్యా శాఖ అనుమతి లేకుండా హిందూ పిల్లలకు ఉర్దూ, కల్మ నమాజ్ నేర్పించడంపై హిందూ సంఘాలు ప్రశ్నించాయన్నారు. సదరు స్కూల్ ప్రిన్సిపాల్, యాజమాన్యంపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేష సంపర్క ప్రముఖ్ అల్జపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి, ఉపాధ్యక్షుడు ప్రేమ్, సహా కార్యదర్శి కరణ్, బజరంగ్ దళ్ ప్రముఖ్ ప్రవీణ్, సాయి, అర్వింద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

**అక్షరటుడే, కోటగిరి:** ‘సర్’ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ వస్తున్నారని.. వారికి పూర్తి వివరాలు అందజేయాలని బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త ఎంఏ హకీం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పోతంగల్ మండల కేంద్రంలో ‘సర్’ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలు ఇచ్చే పత్రాలను ప్రతిఒక్కరూ తీసుకొని తమ ఓటు నమోదును సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జుమ్మా ఖాన్, అఫ్రోజ్, సాజిద్, ఫిరోజ్ ఖాన్, ఇసుబ్ బేక్, షేక్ జునీద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మోతిబిందు సమస్య ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జీవన్, జైడి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్ స్కూల్‌లో 100 కొత్త అడ్మిషన్లు

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇప్పటివరకు 100 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.గంగారాం తెలిపారు. మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, ఇతర విద్యా సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ వివరాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ ప్రవేశాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.



## వేంపల్లి బైపాస్ వద్ద లారీ బోల్తా.. ఒకరు మృతి

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని వేంపల్లి గ్రామ శివారులోని బైపాస్ వద్ద మంగళవారం లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు సంత్రాల లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పట్టపగలే దర్జాగా మొరం తవ్వకాలు..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఓ విలీన గ్రామంలో ప్రభుత్వ భూములు, చెరువుల్లో అక్రమ మొరం వ్యాపారం దర్జాగా సాగుతోంది. ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఊర చెరువును యథేచ్ఛగా తోడేసి మూడు రోజులుగా ట్రాక్టర్లలో మొరం తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుంటున్న కొందరు, ఆ మట్టిని కులసంఘాల భవనాలకు, వ్యక్తిగత ఇళ్ల ముందు వేసేందుకు వినియోగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో ట్రిప్ లోడుకు రూ. 500 వసూలు చేస్తూ రోజుకు వందకు పైగా ట్రిప్పులు తరలిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఇంత బహిరంగంగా జరుగుతున్న అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మౌనం వహించడంతో గ్రామంలో చెరువు క్రమంగా గుంతలమయంగా మారుతోంది. ప్రభుత్వ వనరులను ఇలా బహిరంగంగా దోచుకుంటున్నా చర్యలు లేకపోవడంతో రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## అమ్రాద్‌లో పోలీసుల అవగాహన సదస్సు

**అక్షరటుడే, మాక్లూర్:** మండలంలోని అమ్రాద్ గ్రామంలో పోలీసులు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్సై అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ‘మన ఊరు – మన భద్రత – మన బాధ్యత’ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి మత్తుకు బానిసకాకుండా జాగ్రత్త పడాలని హితవు పలికారు. అలాగే వాహనాలు నడిపే వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సీట్ బెల్ట్, హెల్మెట్ కచ్చితంగా వాడాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

